## ఆర్టీసీ ప్రయాణికులకు మరో గుడ్‌న్యూస్

హైదరాబాద్,తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు కాంగ్రెస్ ప్రభుత్వం మరోగుడ్‌న్యూస్ చెప్పింది. ఇప్పటికే తెలంగాణలో మహాలక్ష్మీ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా ఆధార్ కార్డ్ ఉన్న ప్రతి మహిళకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే.ప్రయాణ ఛార్జీలో ఏకంగా 10 శాతం రాయితీని ప్రకటించింది. అయితే ఇది అన్ని రూట్లలో కాదు. తెలంగాణ నుంచి బెంగళూరుకు ప్రయాణించే వారికి టిక్కెట్ ధరలో పది శాతం రాయితీ కల్పిస్తున్న ప్రకటించింది. బెంగళూరు రూట్‌లో నడిచే అన్ని సర్వీసుల్లోనూ రానుపోనూ ఈ రాయితీ వర్తించనుంది.ఈ రాయితీ వల్ల ఒక్కొక్కరికి రూ.100 నుంచి రూ.160 వరకూ ఆదా అవుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ రూట్ లో టికెట్ల ముందస్తు రిజర్వేషన్ కోసం వెబ్ సైట్‌ని సంప్రదించాల్సింది సూచించారు. అయితే తెలంగాణ నుంచి చాలా మంది బెంగళూరు సిటీకి వెళ్తుంటారు. వ్యాపార పనులపై, అలాగే ఉద్యోగ రిత్యా అక్కడ పనిచేసే వారు కూడా తరచూ బెంగళూరుకు రాకపోకలు సాగిస్తూ ఉంటారు.ఇలాంటి వారికి ఇప్పుడు టీజీఎస్ ఆర్టీస్ ప్రకటించిన ఈ రాయితీ ఎంతో మేలు కూరుతుంది.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :307 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 19-02-2025 | పేజీలు:4 వెల: 2.00


## మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేస్తాం



మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చెందిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి (యెన్నం శ్రీనివాస్ రెడ్డి) అన్నారు. ఇది ఎవరితో సాధ్యం కాదని, ప్రతి ఒక్కరు తమ వంతు సహాయం చేస్తే సరిపోతుంది. ఇందులో భంగా మహబూబ్‌నగర్ విద్యానిధిని ఏర్పాటు చేశామని, సామాజిక స్పృహ కలిగిన వారు సహకరించారు. పట్టణంలోని బీఈడీ కాలేజీలో నూతనంగా నిర్మించిన శౌచాలయాలను ఎమ్మెల్యే కోసం. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలేజీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. మన కళాశాలను, పాఠశాలలను బాగు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ పేద విద్యార్థులు చదువుకుంటారని వారికి పూర్తిగా సౌకర్యాలు కల్పించాలని అది మనందరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ కళాశాల అతి పురాతనమైనదని అందుకే త్వరలో కళాశాలలకు పూర్తిస్థాయి నూతన భవనాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు అందించామని కళాశాల సిబ్బందికి సూచించారు.మహబూబ్ నగర్ ను ఎడ్యుకేషన్ హబ్గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఒక్క వ్యక్తితో అది సాధ్యం కాదు కాబట్టి , ప్రతి ఒక్కరు కూడా తమ సహాయ సహకారాలు అందించాలని ఆయన వంతు. అందుకే మహబూబ్ నగర్ విద్యానిధి ఏర్పాటు చేశామని బాధ్యత కలిగిన పౌరులు సామాజిక స్పృహ కలిగిన ప్రతి ఒక్కరూ కూడా ఈ విద్యానిధికి సహకరించాలని కోరారు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మహబూబ్ నగర్ విద్యా నిధి పారదర్శకంగా పర్యవేక్షణలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రతి నెల తన జీతం నుంచి లక్ష రూపాయలు విద్యానిధిలో జమ చేసింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం గోవిందరాజులు, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు సుధాకర్ రెడ్డి, రామచంద్రయ్య, రాజు గౌడ్, మోయిజ్, ప్రవీణ్ కుమార్, ఇమ్రాన్ కొనసాగుతున్నారు.

## కేంద్ర ఎన్నికల ప్రధానాధికారిగా జ్ఞానేశ్ కుమార్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి18: భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సిఇసిగా జ్ఞానేష్ కుమార్ నియమితులయ్యారు.ఈ మేరకు సోమవారం రాత్రి పొద్దుపోయిన తరువాత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయనతోపాటు ఎన్నికల కమిషనర్‌గా వివేక్‌జోషిని నియమించారు. అంతకుముందు నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకానికి సంబంధించి ప్రధాని మోడీ అధ్యక్షతన సమావేశం జరిగింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా నూతన కమిటీ నియామకం చేస్తున్నదని, సుప్రీంకోర్టులో తీర్పు వచ్చే వరకు ఓపిక పట్టాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. అయినప్పటికీ నూతన సిఇసిగా జ్ఞానేష్ కుమార్ నియామకానికే కేంద్రం మొగ్గుచూపింది. 2029 జనవరి 26 వరకూ ఆయన సిఇసిగా కొనసాగనున్నారు. ప్రస్తుత సిఇసి రాజీవ్ కుమార్ పదవీ కాలం మంగళవారంతో ముగిసింది. జ్ఞానేష్‌కుమార్ కేరళ కేడర్‌కు చెందిన 1989 బ్యాచ్ ఐఎఎస్ అధికారి. అంతకుముందు ఆయన హోం మంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలోని సహకార,



పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖల కార్యదర్శిగా పనిచేసి, పదవీ విరమణ పొందారు. శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌తోసహా అయోధ్య కేసుపై సుప్రీంకోర్టు తీర్పునకు సంబంధించిన విషయాలను చూసేందుకు హోం మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగానికి ఆయన నేతృత్వం వహించారు.

## హైదరాబాద్‌లో ఇసుక మాఫియా...

హైదరాబాద్, హైదరాబాద్‌లో ఇసుక అక్రమ రవాణా, ఇసుక నిల్వలు, విక్రయం జోరుగా సాగుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. వివిధ జిల్లాల్లోని ఇసుక రీచ్‌ల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, నగరంలో అధిక ధరలకు విక్రయిస్తున్న మాఫియా అరాచకాలు మితిమీరుతున్నాయి.ఈ అక్రమ దందాపై టాస్క్ ఫోర్స్ విభాగం దృష్టి సారించి పెద్ద ఎత్తున సోదాలు నిర్వహిస్తోంది. జిల్లాలలోని ఇసుక రీచ్‌ల నుంచి లారీల ద్వారా ఇసుకను సరఫరా చేయించుకునే మాఫియా 10,000 రూపాయలకు ఒక లారీ ఇసుకను కొనుగోలు చేస్తోంది. అయితే, అదే ఇసుకను హైదరాబాద్‌లో 50,000 రూపాయలకు విక్రయిస్తూ భారీ లాభాలు ఆర్జిస్తోంది. ప్రధానంగా, నది తీర ప్రాంతాలకు డెలివరీ పేరుతో బుక్ చేసుకొని నిజానికి హైదరాబాదులో డంప్ చేస్తోంది.హైదరాబాద్‌లోని సికింద్రాబాద్, తాడ్‌బండ్, అలాగే నగర శివారులో పలుచోట్ల ఇసుక డంప్ యార్డులు ఏర్పాటయ్యాయి. ఇవి అధికారికంగా గుర్తించబడని నిల్వ కేంద్రాలుగా మారాయి. టాస్క్ ఫోర్స్ అధికారులు ఈ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి ఇసుక అక్రమ నిల్వలను గుర్తించారు. ఇసుక అక్రమ డంపింగ్‌కి పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి, టాస్క్ ఫోర్స్ అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీలను పట్టుకోవడం, కేసులు నమోదు చేయడం మొదలైంది. అధికారుల చర్యలతో ఇసుక మాఫియాకు గట్టి ఎదురు దెబ్బ పడే



అవకాశం ఉంది.అక్రమంగా ఇసుక నిల్వలు, రవాణా, విక్రయాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్ ఫోర్స్ అధికారులు స్పష్టం చేశారు. ఇసుక అక్రమ దందాకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టి, అవసరమైనట్టయితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిజానికి నిర్మాణ రంగం కోసం ఇసుక అత్యవసరమైన వస్తువు. అయితే దాన్ని అక్రమ మార్గాల్లో నిల్వ చేయడం, అధిక ధరలకు విక్రయించడం సామాన్య ప్రజలపై భారం పెడుతోంది. ఇలాంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

## పాపులారిటీ ఉందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతారా



న్యూఢిల్లీ,ఫిబ్రవరి18: పాపులారిటీ ఉందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతారా ...సభ్య సమాజం అంగీకరిస్తుందని అనుకుంటున్నారా.. అంటూ యూ ట్యూబర్ రణ్‌వీర్ అల్హాదియాకు సుప్రీం మొట్టికాయలు వేసింది. ఇండియాస్ గాట్ లాటెంట్’ కార్యక్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియా పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. పాపులారిటీ ఉంటే ఏదైనా మాట్లాడతారా..? ఇలాంటి భాషను ఎవరైనా ఇష్టపడతారా..? అంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. ‘ఇదంతా అసభ్యత కాకపోతే ఇంకేంటి..? మీ మెదడులోని చెత్తనంతా ఆ ప్రోగ్రామ్ ద్వారా బయటపెట్టారు. ఇలాంటి ప్రవర్తన ఖండించదగినదని వ్యాఖ్యానించింది. . మీరు పాపులర్ అని చెప్పి, ఏదైనా మాట్లాడతా అంటే సమాజం ఆమోదించదు. ఇలాంటి భాషను ఎవరైనా ఇష్టపడతారా..? ఇలాంటి వ్యక్తులకు కోర్టు ఎందుకు రక్షణ కల్పించాలని సుప్రీం ప్రశ్నించింది. రణ్‌వీర్‌ను తీవ్రంగా మందలించిన కోర్టు.. ఆ తర్వాత ఊరట కల్పించింది. ఇక ఈ వ్యవహారంలో మరో పోలీసు కేసు నమోదు చేయొద్దని ఆదేశాలు ఇచ్చింది. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచివెళ్లే ప్రయత్నాలు చేయొద్దని రణ్‌వీర్‌ను హెచ్చరించింది. అలాగే యూట్యూబర్ తన పాస్‌పోర్టును మహారాష్ట్రలోని ఠాణె పోలీసులకు అప్పగించాలని ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎలాంటి షోలు చేయకూడదని తేల్చిచెప్పింది. అసలేం జరిగిందంటే.. ఐజీఎల్‌లో పాల్గొన్న ఓ వ్యక్తిని తల్లిదండ్రుల గురించి, శృంగారం పైన ప్రశ్నించడంతో ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియాపై తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. అతడి వ్యాఖ్యలపై పలువురు పార్లమెంటు సభ్యులు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. సమయ్ రైనా షోలో రణ్‌వీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. దాంతో అతడిపై పలు రాష్ట్రాల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వాటిపై ఇటీవల యూట్యూబర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు అన్నింటినీ క్లబ్ చేయాలని ఓ పిటిషన్‌లో పేర్కొన్నాడు. దానిపైనే తాజాగా విచారణ జరిగింది. ఇటీవలే సుప్రీంకోర్టు సీజేఐ బాధ్యతల నుంచి రిటైరైన జస్టిస్ డీవై చంద్రచూడ్ కుమారుడు అభినవ్ చంద్రచూడ్.. రణ్‌వీర్ తరఫున వాదనలు వినిపించారు. నైతిక విలువల ప్రకారం తన క్లయింట్ వ్యాఖ్యలు సమర్థించనని, అయితే అతడిని హత్య చేస్తామంటూ బెదిరింపులు వస్తున్నాయని కోర్టుకు వెల్లడించారు. ఆ సమయంలో మహారాష్ట్ర, అస్సాం పోలీసులను ఆశ్రయించవచ్చని కోర్టు సూచించింది. అలాగే సామాజిక మాధ్యమాల్లో అశ్లీల కంటెంట్‌ను నియంత్రించడానికి ఏవైనా చర్యలు తీసుకొనే యోచనలో ఉన్నారా..? అని ఈసందర్భంగా కేంద్రాన్ని ప్రశ్నించింది. దానిపై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేసింది.

## అర్థం పర్థంలేని హామీలతో సీఎం గందరగోళం



హైదరాబాద్,ఫిబ్రవరి18: అర్థంలేని హామీలతో సీఎంరేవంత్ ఆయన గందరగోళానికి గురికావడమే కాకుండా, ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బీజేపీ అభ్యర్థి సరోత్తం రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఈటెల రాజేందర్ పాల్గొని మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బీజేపీకి మద్దతు పలుకుతున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పీఆర్సీ ఏమైంది... డీఏలు ఏమయ్యాయని నిలదీశారు. సీపీఎస్ విధానంపై ఎటువంటి నిర్ణయం తీసుకున్నారని అడిగారు. గతంలో యూటీఎఫ్ అభ్యర్థిని గెలిపిస్తే ఒరిగింది ఏమీ లేదని విమర్శించారు. బీజేపీ పాలనలో దేశం సుభిక్షమని.. అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందన్నారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీకి ఓటు వేస్తామని ఉపాధ్యాయులు చెబుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయలకు అండగా ఉంటామని.. సమస్యల పరిష్కారానికి కొట్లాడతామని స్పష్టం చేశారు. కులాన్ని విస్మరించలేమని.. కుల గణన జరగాలన్నారు. కాంగ్రెస్‌కు నిజాయితీ, చిత్తశుద్ధి ఉంటే అధికారికంగా లెక్కలు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రతి నిర్ణయం బూమరాంగ్ అవుతోందన్నారు. 2011 జనాభా లెక్కలకు ఇప్పటి లెక్కలకు పొంతన లేకుండా చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. ప్రజల జీవితాలతో ఆడుకోవద్దని.. డ్రామా కంపెనీలా చేయవద్దని హితవుపలికారు. ఈ దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఈ దేశంలో ఎన్నడైనా ఎక్కడైనా కాంగ్రెస్ బలహీన వర్గాలకు పదవులు కట్టబెట్టిందా అని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో లేదా ఇప్పుడు బలహీన వర్గాలకు చెందిన నేతలు ముఖ్య మంత్రులయ్యారా అని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకుకి సిద్ధంగా ఉందని వెల్లడించారు. కానీ.. రాష్ట్ర ప్రభుత్వం అందుకు సిద్ధంగా లేదన్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన, లగచర్ల భూములు ఇలా ప్రతి విషయంలోనూ రేవంత్ ప్రభుత్వం ప్రజలకు అన్యాయం చేసిందన్నారు. రాబోయే రోజులలలో కాంగ్రెస్ ఎన్నికల హామీలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, కొట్లాడతామని ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు.

## వంశీ ఏ తప్పూ చేయలేదు.. ఇది చంద్రబాబు కుట్ర...

విజయవాడ,వల్లభనేని వంశీ అరెస్ట్.. రాష్ట్రంలో దిగజారిపోయిన లా అండ్ ఆర్డర్‌కు అద్దం పడుతోందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఇదంతా వంశీపై కక్షతో చంద్రబాబు చేస్తున్న కుట్ర అని మండిపడ్డారాయన. మంగళవారం విజయవాడ సబ్ జైల్లో వల్లభనేని వంశీతో ములాఖత్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీసులు పెట్టిన కేసు ఏంటి?. టీడీపీ ఫిర్యాదులో ఎక్కడా వల్లభనేని వంశీ పేరు లేదు. వంశీ ఎలాంటి తప్పు చేయలేదని టీడీపీ ఆఫీస్‌లో పని చేసే సత్యవర్ధన్ చెప్పారు. పట్టాభి, ఆయన అనుచరులు కలిసి ఓ ఎస్సీ నేతపై దాడి చేశారు. అయినా వంశీపై తప్పుడు కేసులు పెట్టారు. పట్టాభి రెచ్చగొట్టడం వల్లే గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై దాడి జరిగింది. వంశీని రెచ్చగొట్టేలా పట్టాభి నీచంగా మాట్లాడారు. పట్టాభిని చంద్రబాబే పంపించి గన్నవరంలో దాడి చేయించారు. మంగళగిరికి సత్యవర్ధన్‌ను పిలిపించుకుని మరో ఫిర్యాదు చేయించారు. ఆ కేసులోనూ ఎక్కడా వంశీ పేరు లేదు. టీడీపీ ప్రభుత్వం రాగానే వంశీని టార్గెట్ చేశారు. కేసు మళ్లీ రీ ఓపెన్ చేశారు. సత్యవర్ధన్ నుంచి మరోసారి స్టేట్‌మెంట్ తీసున్నారు. అందులోనూ వంశీ తప్పు లేదని చెప్పారు. దీంతో గన్నవరం టీడీపీ కార్యాలయం తగలబెట్టే ప్రయత్నం చేశారని, ఆ కార్యాలయం ఎస్సీ,ఎస్టీలకు సంబంధించిందని వంశీపై చంద్రబాబు తప్పుడు కేసులు పెట్టించారు. టీడీపీ కార్యాలయం తగలబడింది లేదు.. ఆ కార్యాలయం ఎస్సీ,ఎస్టీలకు సంబంధించింది కాదు. వంశీపై చంద్రబాబు కక్ష గట్టి తప్పుడు కేసులు పెట్టించారు. వంశీకి బెయిల్ రాకూడదని చంద్రబాబు నాన్ బెయిలబుల్ కేసులు పెట్టించారు. మరో నెలల తరబడి బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారు. మరో 44 మంది వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు పెట్టారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

పిడుగురాళ్లలో వైస్ చైర్మన్ పదవి విషయంలో ఏం జరిగిందో చూశాం. 33 కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీనే గెలిచింది. అయినా వైస్ చైర్మన్ తామే గెలిచామని టీడీపీ ప్రకటించుంది. తునిలో కూడా 30కి 30 స్థానాలు YSRCPనే గెలిచింది. పాలకొండలోనూ ఇలాన్టే చేస్తున్నారు. అంతటా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. పోలీసులు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తప్పుడు కేసులు పెడుతున్నారు.

అధికారులకు జగన్ విజ్ఞప్తి

కూటమి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ. పారిశ్రామిక వేత్తలను వీళ్లే బెదిరిస్తారు.. మళ్లీ వీళ్లే కేసులు పెడతారు. పోలీసులను ఇష్టానుసారంగా వాడుకుంటున్నారు. పోలీసులు చంద్రబాబు చెబుతున్న వాళ్లకు కాకుండా.. టోపీ మీదున్న మూడు



సింహాలకు సెల్యూట్ చేయండి. ఎల్లకాలం టీడీపీ అధికారంలో ఉండదు. రేపు మా పార్టీ అధికారంలోకి వస్తుంది. అధికారంలోకి వచ్చాక అన్యాయం చేసినవారిని వదిలిపెట్టం. అన్యాయం చేసిన వారిని బట్టలూడదీసి నిలబెడతాం. రిటైర్ అయినా.. సప్తసముద్రాల అవతల ఉన్నా రప్పిస్తాం. అన్యాయం చేసిన వారిని చట్టం ముందు నిలబెడతాం. ప్రజలు, దేవుడు శిక్షించే రోజు దగ్గర్లోనే ఉంది. అన్యాయంలో భాగస్వామ్యం కావొద్దు.

## ముగిసిన నామినేషన్ల ప్రక్రియ.. 17 నామినేషన్లు దాఖలు

హైదరాబాద్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) స్టాండింగ్ కమిటీ సభ్యుల నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ పూర్తయింది. మొత్తం 15 స్టాండింగ్ కమిటీ సభ్యుల స్థానాలకు 17 నామినేషన్లు దాఖలయ్యాయి.ఇవన్నీ చెల్లుబాటు అయ్యేలా ఉన్నాయని GHMC కమిషనర్, రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. కమిటీ సభ్యులుగా నిలబడిన అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు అవకాశం ఉంది. ఈ లోపు ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకుంటే, స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసే అవకాశముంది.అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకోని పరిస్థితిలో, ఈ నెల 25వ తేదీన స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరుగుతాయి. అదేరోజు ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయి ఫలితాలు వెల్లడికానున్నాయి. GHMC స్టాండింగ్ కమిటీ మున్సిపల్ పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తుంది. నగర అభివృద్ధి, బడ్జెట్ వ్యయాలు, మౌలిక సదుపాయాల ప్రణాళికలపై ఈ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. అందువల్ల ఈ ఎన్నికలు నగర పాలనలో కీలకమైనవిగా మారాయి. ఇప్పటికే




అన్ని నామినేషన్లు చెల్లుబాటు అయ్యాయని ప్రకటించిన GHMC అధికారులు, ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 21వ తేదీ తర్వాత నామినేషన్ల ఉపసంహరణపై క్లారిటీ రానుంది. 25న ఎన్నికలు జరిగితే, GHMC కొత్త స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎంపిక ప్రక్రియ పూర్తవుతుంది.

## పచ్చకామెర్లవాడికి ఊరంతా పచ్చగే...

హైదరాబాద్, పచ్చకామెర్లవాడికి ఊరంతా పచ్చగా కనపడుతుందన్న సామెతలా సీఎం రేవంత్‌రెడ్డికి తను మూతాలు తీసుకుంటున్న మాదిరిగా ఐఎఎస్‌లు తీసుకుంటున్నారని అనుకుంటున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని ఐఎఎస్, ఐపీఎస్ అధికారులను అవమానపరిచేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పచ్చకామెర్ల వానికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది. మీరు బ్యాగులతో దొరికారని అందరూ మీ లాగానే బ్లాక్‌మెయిల్ దందాలు చేస్తారని సెటిల్‌మెంట్లు, దందాలు చేస్తూ బతుకుతున్నారని అనుకోవడం తప్పు. ఐఎఎస్, ఐపీఎస్ అధికారులు మన దేశ ప్రజాస్వామ్యానికి వెన్నెముకలు అని కేటీఆర్ పేర్కొన్నారు. సివిల్ సర్వెంట్స్ అంటే.. కార్యాచరణ రూపొందించడంలో నిష్ణాతులు.. కానీ ఏసీలో ఉండి యాక్షన్ చేసే వారు కాదు. సీఎం రేవంత్ రెడ్డి ఐఎఎస్, ఐపీఎస్ అధికారులను అవమానించేలా మాట్లాడారు. ఆ మాటలు అమర్యాదగా ఉన్నాయని కేటీఆర్ మండిపడ్డారు. అధికార వ్యవస్థ ప్రతిష్టను నాశనం చేసేందుకు సీఎం రేవంత్ నిరంతరం చేస్తున్న ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కేటీఆర్ తెలిపారు.

## సంపాదకీయం

బుధవారం 19-02-2025

# పంటల ఉత్పత్తి..ఎగుమతులపై కార్యాచరణ కావాలి !

భారతదేశంలో వాణిజ్యపంటలకు కొదువ లేదు. మనదేశ ప్రజలకు అవసరమైన అన్ని రకాల వాణిజ్య పంటలతో పాటు, ఉప్పులు,పప్పులు పండుతాయి. నూనెగింజలు పండుతాయి. అందులో పసుపు, మిర్చి, పత్తి, ధనియాలు, అల్లం, వెల్లుల్లి, వేరుశనగ, నువ్వులు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో పాలు రకరకాల వరిధాన్యం కూడా పండుతుంది. మన నేలలో ఈ పంటలకు అనువుగా ఉన్నాయి. నేలలకు అనువుగా మనకు నదులు, సరస్సులు ఉన్నాయి. క ష్టపడి పండించేందుకు అన్నదాతలు సిద్దంగా ఉన్నారు. లేనిదల్లా ప్రోత్సాహం ఒక్కటే. అయినా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా తిండానికి తిండిదొరకని ఎన్నో కుటుంబాలు చూస్తున్నాం. దేశంలో పండుతున్న పంటను ప్రోత్సహించి, ప్రజలకు తిండిగింజల కొరత లేకుండా చేయడం ఒక ఎత్తు. వాణిజ్యపరంగా ఉత్పత్తి చేసేలా ప్రోత్సహించి విదేశాలకు ఎగుమతులు చేయడం మరో ఎత్తు. ఇలా ఒక్క వ్యవసాయంతోనే మన దేశ దరిద్రం తీరుతుంది. భూములు, వనరులు, మానవ వనరులు ఉన్నా ఉపయోగించే నైపుణ్యం ప్రభుత్వాలకు ఉండడం లేదు. అందుకే దేశీయంగా పంటలను ప్రోత్సహించడం లేదు. గిట్టుబాటు ధరలు కల్పించడం లేదు. దీనికితోడు అసవరమున్నా లేకున్నా అన్నీ దిగుమతి చేసుకునేం దుకు అలవాటు పడ్డాం. ఈ క్రమంలో దేశీంగా పసుపు, మిర్చి, పత్తి పంటలు విపరీతంగా పండుతున్నా ధరలు లేక రైతులు దిగాలు పడుతున్నారు. ప్రజలేమో ధరలు పెట్టి కొనలేక బాధపడుతున్నారు. ఈ వ్యత్యాసాన్ని గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. పసుపు రెండు వేల సంవత్సరాలుగా ఒక అద్భుత ఔషధంగా, సౌందర్య సాధనంగా, వంటలలో ముఖ్యమైన దినుసుగా, వస్త్రాలపై అద్దకంగా ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా హిందువులు తమ నిత్యజీవితంలో ఏ శుభకార్యమైనా పసుపుతోనే ప్రారంభిస్తారు. భారతదేశంలో పసుపు లేని ఇల్లు ఉండదని చెప్పడంలో అతిశయోక్తి లేదు. పసుపుతో పాటు మిర్చి, అల్లం వెల్లుల్లి కూడా వాణిజ్యస్థాయిలో పండించే సత్తా మన రైతులకు ఉంది. అలాంటి పసుపుకు బోర్డు కోసం రైతులు ఏళ్లుగా పోరాడాల్సి వచ్చింది. రైతు తలచుకుంటే పంట పండించడమే కాదు, పంటకి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించే బోర్డు ఎలా సాధించుకోవాలో కూడా తెలుసు. పసుపు బోర్డు సాధించి చూపించిన నిజామాబాద్ రైతులు దేశవ్యాప్తంగా ఎంతోమంది రైతులకు ఆదర్శంగా నిలిచారు. పసుపు బోర్డు కోసం 2006లో మొదలైన పోరాటం 2 దశాబ్దాలుగా అలుపెరగకుండా సాగింది. ఇకపోతే పంజాబ్, హర్యానా రైతులు కూడా పంటల గిట్టుబాటు ధరల కోసం ఏళ్లు గా పోరాడుతున్నారు. వారి వెనక రాజకీయ కోణాలు ఉన్నాయన్న విషయాన్ని పక్కన పెట్టి వారితో చర్చించి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ది ప్రకటించడం లేదు. ఇకపోతే తెలంగాణలో పసుపు బోర్డు ఏర్పాటయ్యింది కనుక ఇక వారి కష్టాలు గట్టెక్కాల్సిన అవసరం ఉంది. పసుపు బోర్డును నిజామాబాద్‌లో ఏర్పాటు చేసుకోవడం ఓ రకంగా రైతుల విజయానికి నాంది అనుకోవాలి. పసుపు బోర్డు సాధనలో వారు చూపిన తెగువ ఎనలేనిది. 2019 లోకసభ ఎన్నికల్లో 178 మంది పసుపు రైతులు నిజామాబాద్ ఎంపీ గా పోటీచేయడానికి నామినేషన్ వేయడం. వీరికోసం ఏకంగా ఒక్కో బూత్‌లో 12 ఈవీఎం మిషన్లు వాడాల్సి రావడం వంటివన్నీ జాతీయస్థాయిలో సమస్యను చాటాయి. వీరు దాదాపు లక్ష ఓట్లు పొందడం ఆ ప్రాంతంలో పసుపు బోర్డు డిమాండ్ ఎంత బలంగా ఉందో అనడానికి నిదర్శనంగా నిలిచింది. అంతే కాకుండా వారణాశిలో 30 మంది పసుపు రైతులు నామినేషన్ వేసి మోదీపై పోటీకి దిగారు. 2014 లోక్ సభ ఎన్నికల్లో కూడా దాదాపు 27 మంది రైతులు పోటీచేశారు. పొలాల్లో పంటలు పండించడమే కాదు, రాజకీయ చతురత కూడా ప్రదర్శించగలమని రైతన్నలు నిరూపించారు. అయితే రైతులు పోరాటాలుచేస్తే తప్ప సమస్యలు గుర్తించకుండా ప్రభుత్వాలు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాయి. ఇదే తరహాలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ కూడా ఉంది. నిజానికి రైతుల ఆకాంక్షల మేరకు బోర్డులు ఏర్పాటు చేయడం లేదా...పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా ప్రోత్సహించడం, ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయడం ప్రభుత్వాల విధి. ఒక బోర్డుల ఏర్పాటును పరిశీలిస్తే...కాఫీ ఉత్పత్తులు పెంచడానికి 1942లో బెంగళూరు కేంద్రంగా కాఫీ బోర్డును స్థాపించారు. రబ్బరులో శాస్త్రీయ, సాంకేతిక, ఆర్థిక పరిశోధనలు, మార్కెటింగ్‌ను ప్రోత్సహించడానికి 1947లో కేరళలోని కొట్టాయంలో రబ్బర్ బోర్డును స్థాపించారు. టీ ఉత్పత్తి, ఎగుమతులు పెంచడానికి 1954లో కోల్‌కత్తాలో టీ బోర్డును స్థాపించారు. టొబాకో ఎగుమతులను పెంచడానికి1976 లో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో టొబాకో బోర్డు స్థాపించారు. కొబ్బరి ఉత్పాదకత పెరుగుదల, ఉత్పత్తుల వైవిధ్యీకరణపై దృష్టి సారించి దేశంలో కొబ్బరి ఉత్పత్తి, వినియోగం కోసం సమగ్ర అభివృద్ధి కోసం కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డును 1981లో కేరళలోని కొచ్చిన్ లో స్థాపించారు. ఇలా పంటల దిగుబడిని పెంచి, రైతులకు లాభాలు చేకూర్చడంతో పాటు, ఎగుమతుల ద్వారా ఆదాయం పెంచడం లక్ష్యంగా ఆయా బోర్డులను పెంచారు. అలాగే ఆయా పంటల ఉత్పత్తులపైనా ఇప్పుడు దృష్టి సారించాల్సి ఉంది. రైతులకు లాభం చేకూర్చేలా ఎగుమతులను అనుకూల పరిస్థితులను సృష్టించడం, పంట నాణ్యతను మెరుగుపర్చడం, కొత్త వంగడాల అభివృద్ధి కోసం పరిశోధనలు నిర్వహించి సలహాలు అందించడం, పంట విస్తీర్ణాన్ని పెంచడం, అధిక దిగుబడుల కోసం కృషి చేయడం అవసరం. పసుపు సాగు, ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌ను ప్రోత్సహించడం,పసుపు రైతుల ఆదాయాన్ని పెంచడంతోపాటు పసుపు ఔషధ ప్రయోజనాలపై అవగాహన పెంచడం కోసం తాజాగా పసుపు బోర్డు ఏర్పాటు అయ్యింది. ఈ బోర్డు ద్వారా రైతులకు పసుపు తవ్వకం, ఆరబెట్టడం, ఉడకబెట్టడం, డ్రై చేయడం, పాలిష్ చేయడానికి అవసరమైన యంత్రాలను రాయితీపై అందించడం జరుగుతుంది. పసుపు పంట విత్తిన తరువాత అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడం, నాణ్యత, దిగుబడి పెంచేలా రైతులకు సహకారం అందిస్తుంది. ఇక పసుపు పంట మార్కెటింగ్ కోసం అంతర్జాతీయ కంపెనీలను తీసుకువచ్చే బాధ్యత సైతం బోర్డు తీసుకుంటుంది. పసుపు పండిస్తున్న 20 రాష్ట్రాల రైతులకు ప్రత్యేక లాభం చేకూర నున్నది. అయితే పంట ఏదైనా దేశీయంగా చవకగా లభించి, ఎగుమతుల ద్వారా రైతులకు ఆర్జన చేసి పెట్టేలా పంటల విధానాన్ని ప్రభుత్వాలు అనుసరించాలి. అప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు, దేశ ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడగలదు.


# బండి వర్సెస్ రాజా సింగ్.. బీజేపీలో కొత్త లొల్లి

హైదరాబాద్, రాజాసింగ్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ చురకలు అంటించారా..? లేక లైట్‌గా హెచ్చరికలు జారీ చేశారా..? ఎందుకు రాజాసింగ్ వ్యవహారంపై బండి సంజయ్ ఆ రేంజ్‌లో స్పందించాల్సి వచ్చింది..? బండి సంజయ్ కన్నా దూకుడుగా హిందుత్వ వాదంతో రాజాసింగ్ దూసుకుపోతున్నారా..? ఆ దూకుడు బండి సంజయ్ కే కాదు రాష్ట్ర నాయకత్వానికి అస్సలు నచ్చడం లేదా..? ఇంతకు కాషాయ వనంలో రాజాసింగ్ పాత్ర ఏంటి..? రాజాసింగ్ ను పార్టీలో ఉంచుకుంటారా..? వెళ్లగొడతారా..?రాజాసింగ్ మా పార్టీ ఎమ్మెల్యే అంటూనే.. రాజాసింగ్ కోసం రూల్స్ మార్చాలా..? వ్యక్తి కోసమో.. వ్యక్తి ప్రయోజనాల కోసమో భారతీయ జనతా పార్టీ స్టాండ్ మార్చుకునే పార్టీనా..? అంటూ గోషామహల్ బాద్‌షా రాజాసింగ్‌కు గట్టిగానే చురకలు అంటించారు కేంద్ర మంత్రి బండి సంజయ్. దాంతో టోటల్ సీన్ అంతా రాజాసింగ్ వర్సెస్ బండి సంజయ్ అన్నట్లు మారిపోయింది. ఇటు పార్టీ రాజాసింగ్ వర్గీయులు, అటు బండి సంజయ్ వర్గీయులు కూడా సై అంటే సై అనుకునే పరిస్థితి తలెత్తింది. ఇప్పటికే మా దమ్మెంటో చూపిస్తాం అంటూ రాజాసింగ్ రాష్ట్ర నాయకత్వానికి పంపిన హెచ్చరికలకు %% అంతే గట్టిగా మీ దమ్మెంటో అధిష్టానం చూసుకుంటుంది మేము కాదంటూ బండి సంజయ్ ధీటుగా సమాధానాలు ఇస్తున్నారు. దీంతో పార్టీ సంస్థాగత ఎన్నికల సీన్ అంతా ఒక్కసారిగా మారిపోయింది. ఇటీవల బిజెపి జిల్లా అధ్యక్షుల నియామకం జరిగింది. తొలుత 19 మంది జిల్లా అధ్యక్షులను, తాజాగా మరో నలుగురు జిల్లా అధ్యక్షులను పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ నలుగురి పేర్లలో రాజాసింగ్ సూచించిన గోల్కొండ అధ్యక్షుడి పేరు లేకపోవడమే వివాదానికి కారణమైంది. గోల్కొండ బీజేపీ అధ్యక్షుడి ఉమా మహేశ్ పేరును అధిష్టానం ప్రకటించడం రాజాసింగ్ కు మింగుడు పడటం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా రాజాసింగ్ పోటీ చేసినప్పుడు ఉమా మహేశ్ సహకరించలేదంట. కాంగ్రెస్ , ఎంఐఎం పార్టీలతో ఉమా మహేశ్ కుమ్మక్కు అయ్యారని రాజాసింగ్ ఆరోపిస్తూ.. పార్టీ నిర్ణయంపై ఫైర్ అవుతున్నారు. ఈ నేపథ్యంలో రాజాసింగ్ ఎపిసోడ్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. హిందుత్వ ఎజెండాను ముందుకు తీసుకుపోవడంలో రాజాసింగ్, బండి సంజయ్ లకు మించిన నేతలు తెలంగాణ బీజేపీలో లేరు.. ఎందుకంటే మసీదు తవ్వితే శివ లింగాలు వస్తే మాకు, శవాలు వస్తే మీకు అంటూ ఒక వర్గాన్ని టార్గెట్ చేస్తూ కామెంట్లు చేసి అప్పట్లో కలకలం రేపారు బండి సంజయ్.. రాజాసింగ్ అయితే మహమ్మద్ ప్రవక్త మీద వివాదస్పద వాఖ్యలు చేసి, పార్టీ నుంచి రెండేళ్ల పాటు సస్పెండ్ కూడా అయ్యారు. అయితే బ్యాక్ రౌండ్ లేకనో, ఇంకోటో తెలీదు కానీ రాజాసింగ్ పార్టీ నుంచి సస్పెండ్ అయి అవమానాలు ఎదుర్కొంటే.. బండి సంజయ్ కరీంనగర్ కార్పొరేటర్ స్థాయి నుంచి కేంద్ర మంత్రిగా ఎదిగారు. గోషామహల్ నుంచి వరుసగా గెలుస్తున్న రాజాసింగ్‌కి శాసనసభలో పార్టీ ఫ్లోర్ లీడర్ అవ్వాలనే కోరిక ఉన్నప్పటికీ ఆ కోరిక నెరవేరలేదు. కానీ బండి సంజయ్ మాత్రం కేంద్ర మంత్రి అయ్యారు. అలాంటి కరుడుగట్టిన హిందుత్వ నేతల మధ్య తేడాలు రావడం బీజేపీలో చర్చనీయాంశంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేతలో బండి సంజయ్ ప్రధాన పాత్ర పోషించారు. అటువంటి బండి సంజయ్ మారిపోయారని రాజాసింగ్ వర్గం అంటోంది. రాజసింగ్ పార్టీ లైన్ దాటుతూ లిమిట్స్ క్రాస్ చేస్తున్నారని బండి సంజయ్ అంటున్నారు. ఇలా వారిద్దరు పరస్పర విమర్శలు చేసుకునే స్థాయికి వచ్చారంటే పార్టీలో ఏం జరుగుతుందో అర్థంకావడం లేదని తలలు పట్టుకుంటున్నాయి




కాషాయ శ్రేణులు. జిల్లాల అధ్యక్షుల నియామకంలో రాజసింగ్ చేసిన వ్యాఖ్యలకు బండి సంజయ్ కౌంటర్ ఇవ్వడంతో వారిద్దరి మధ్య వార్ పీక్ స్టేజికి చేరుకుందనే టాక్ పొలిటికల్ సర్కిల్లో వినిపిస్తోంది. సరే హిందుత్వ ఎజెండానీ ఎవరు ఎక్కువగా ముందుకు తీసుకెళ్తున్నారు అనేది అటు ఉంచితే, దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఏ హిందుత్వ కార్యక్రమాలకైనా తెలంగాణ నుంచి రాజసింగ్ కు మాత్రమే ఆహ్వానం ఉంటుంది, తాజాగా మధ్య ప్రదేశ్ లో జరిగిన హిందుత్వ భారీ బహిరంగ సభలో తెలంగాణ బీజేపీ నుంచి రాజసింగ్ ముఖ్య వ్యక్తగా పాల్గొన్నారు.. అది రాష్ట్ర బీజేపీ నేతలకు ఎవరికి మింగుడు పడటం లేదనే టాక్ వినిపిస్తోంది. అందులో భాగంగానే బండి సంజయ్ తో పాటు బీజేపీలో ఉన్న కీలక లీడర్లను రాజాసింగ్ క్రాస్ చేస్తున్నారని, అందుకే ఆయన్ని సైడ్ చేయాలనే ఉద్దేశంతో పార్టీ రాష్ట్ర నాయకులు ఉన్నారనే చర్చ నడుస్తోంది. అది అట్లా ఉంచితే ఇన్సైడ్ జరుగుతున్న పరిణామాలను, అంశాలను దృష్టిలో పెట్టుకొని తనపై కావాలనే పార్టీలో కుట్రలు చేస్తున్నారని, స్వయంగా రాజాసింగే చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు బీజేపీలో హాట్ టాపిక్‌గా మారాయి. రాజసింగ్ పార్టీ లైన్ దాటితే ఆ వ్యవహారం పార్టీ చూసుకుంటుంది.. కానీ అందుకు భిన్నంగా రాజసింగ్ వ్యవహారంపై బండి సంజయ్ స్పందించడం రచ్చ రేపుతోంది. మొత్తం మీద అంతర్గతంగా ఉన్న విభేధాలన్నీ సంస్థాగత ఎన్నికల్లో బయటపడుతుండటంతో అధిష్టానం రాష్ట్ర పార్టీపై గట్టి ఫోకస్ పెడుతోందంట. ఎందుకంటే దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ రాజకీయాలు వేరని అధిష్టానానికి బాగా తెలుసు. అందులో భాగంగానే ఆచితూచి అధిష్టానం అడుగులు వేస్తోంది. ఉన్న ఫలంగా రాజాసింగ్ దూరమైతే పార్టీ తెలంగాణపై అనుకున్న లక్ష్యాలకు భారీ గండి పడుతుందనే అంచనాల్లో అధిష్టానం ఉన్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే ఇటు రాజాసింగ్, అటూ బండి సంజయ్ లకు అధిష్టానం క్లాస్ పీకినట్టుగా తెలుస్తోంది. ఎవరికి ఎవరు న్యాయ నిర్ణేతలు అవకండి సంయమనం పాటించండి అని సున్నితంగానే మందలించినట్టు సమాచారం. అయితే ఈ పంచాయితీలన్ని సంస్థాగత ఎన్నికల నుంచే ఏర్పడ్డాయి కాబట్టి పార్టీ నేతలపై వస్తున్న ప్రచారాలకు చెక్ పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఆ ఎత్తుగడలు ఫలించడం లేదు. అయినా పార్టీ నాయకత్వం అధ్యక్షుల నియామకంలో ఎలాంటి ఒత్తిడిలకు లోనవ్వకుండా సంస్థగత ఎన్నికలు జరుగుతున్నాయని, ఎలాంటి ఏకపక్ష నిర్ణయాలు లేవని, జిల్లాల అధ్యక్షుల ఎంపికలో పార్టీ నిర్ణయమే ఫైనల్ అని బీజేపీ రాష్ట్ర సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ ఇన్చార్జి ఎండల లక్ష్మీనారాయణ చెప్పుకొస్తున్నారు. అంతేకాదు రాజాసింగ్ వ్యాఖ్యలపై స్పందిస్తూ రాజాసింగ్ ప్రపోజల్ చేసిన వ్యక్తుల్లోనే ఒకరికి గోల్కొండ అధ్యక్షుడిగా నియమించడం జరిగిందని బాంబు పేల్చారు. ఎండల లక్ష్మి నారాయణ చెబుతున్న మాటలకు, రాజాసింగ్ చేస్తున్న వాఖ్యలకు ఎలాంటి పొంతన లేకుండా ఉండటంతో పార్టీ వర్గాల్లో మరో చర్చ మొదలైంది..మొత్తం మీద బీజేపీ సంస్థాగత ఎన్నికలు

# కులగణన సర్వేతో ప్రభుత్వం అభాసుపాలు !



హైదరాబాద్,ప్రధాని మోడీ బిసి కాదు..ఆయన కులం తరవాత బిసిలో చేరింది...అందుకే మోడీ బిసి అయ్యారు. అందువల్ల ముందునుంచీ ప్రధాని మోడీ బిసి కాదు...ఈ విసయాన్ని ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి ప్రస్తావిస్తూ.. అసలు మోడీ బిసియే కాదని సెలవిచ్చారు. ఇప్పుడు మోడీ బిసి అయినంత మాత్రన ఒరిగేదేమీ లేదు. కానందువల్ల వచ్చే నష్టం కూడా లేదు. బిసి కులగణన సందర్భంగా జరుగుతన్న విమర్శలకు సమాధానం ఇచ్చే క్రమంలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. నిజానికి రాజకీయాల్లో ఇలాంటి వ్యాఖ్యలే అస్థిరతకు కారణం అవుతాయి. తనకు రాజకీయల లబ్ది జరుగుతుందని భావించే సిఎం రేవం ఈ వ్యాఖ్యలు చేశారు. ఇందులో సందేహం లేదు. దీనిని బిజెపి నేతలు సహజంగానే తిప్పికొట్టారు. సిఎం రేవంత్‌పైనా విరుచుకు పడ్డారు. రాహుల్ కులమేంటో చెప్పాలన్న డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజలకు మేలుచేసేవి ఎంతమాత్రం కాదు. రెచ్చొగట్టే వ్యాఖ్యలతో రాజకీయాలను కలుషితం చేయరాదు. రాజకీయ నాయకులు అసలు విషయం మరచి, పాలనను మరచి ఇలాంటి వ్యాఖ్యలతో కాలక్షేపం చేస్తూ ఉంటారు. నిజానికి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 మాసాలు అవుతోంది. ఈ కాలంలో ఎన్ని మంచి పనులు చేశావో, ఎన్ని చేయలేకపోయామో ఆత్మవిమర్శల చేసు కోవాల్సి ఉంది. అలాగే కులగణనతో జరిగే లాభం అంతకన్నా లేదు. ఎందుకంటే కులగణనతో బిసి రిజర్వేషన్లు ఇచ్చే అధికారం ప్రభుత్వానికి లేదు. అసెంబ్లీలో కులగణన సర్వే ప్రవేశ పెట్టిన ప్రభుత్వం ఓ రకంగా అభాసు పాలయ్యింది. అందుకే మరోమారు రీ సర్వేకు ఆదేశించింది. తొందరపడి సర్వే చేపట్టడం కేవలం రాహుల్‌ను సంతృప్తి పరచే రాజకీయ విన్యాసం తప్ప మరోటి కాదు. రాహుల్ ఆదేశాలను పాటించేందుకే ఉన్నానని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు..కనుక ఈ తతంగం అంతా అందుకోసమే అని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ క్రమంలోనే తీవ్ర విమర్శలు రావడంతో కలుగణన రీసర్వే మొదలైంది. ఈనెల 28 వరకు కులగణనలో నమోదు చేసేందుకు ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రజలు మూడంచెల విధానంలో రెండోసారి సర్వే చేస్తోంది సర్కార్. మరోవైపు రీసర్వేపైనావి విపక్షాలు మర్శలు గుప్పిస్తున్నాయి. చిత్తశుద్ధిలేని సర్వేలు ఎన్నిసార్లు చేసిన బూడిదలో పోసిన పన్నీరే అంటున్నాయి. తెలంగాణలో కులగణన తప్పుల తడక అంటూ విపక్షాలు, బీసీ , ఎస్సీ ఎస్టీ సంఘాల నుంచి విమర్శలు రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రీ సర్వే చేపట్టింది. కులగణనలో వివరాలు నమోదు చేసుకోనివారంతా ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరుతున్నారు. రెండోసారి సర్వేకోసం మూడంచెల విధానాన్ని అధికారులు అమలు చేస్తున్నారు. ఆన్‌లైన్ తో పాటు ఆఫ్ లైన్‌లోనూ వివరాలు సేకరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారు. ఈ టోల్ ఫ్రీ నెంబర్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందని తెలిపారు. ఫోన్ చేసిన వారి ఇళ్లకి వెళ్లి ఎన్యుమరేటర్లు వివరాలు నమోదు చేసుకుంటున్నారు. కులగణనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏకంగా బీసీ కమిషన్ రంగంలోకి దిగింది. గతంలో నిర్వహించిన సర్వేలో మొత్తం కోటి 15లక్షల కుటుంబాలకు గాను కోటి12 లక్షల కుటుంబాలు సర్వేలో పాల్గొన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో వెల్లడించింది. కులగణనలో పాల్గనని 3లక్షల 56వేల మంది కోసం రెండోసారి సర్వేకు అవకాశం కల్పించింది. మొత్తంగా సర్వే అభాసు పాలయ్యింది. పరస్పర విమర్శలు మిగిలాయి. మోడీ కులంతో పాటు, రాహుల్ కులం గురించి కూడా విమర్శలు రావడం చూస్తున్నాం. ఇకపోతే పాలనా పగ్గాలు చేపట్టిన తరవాత కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకోవడంలోనే రేవంత్ రెడ్డి కాలం గడిచి పోతోంది. ఢిల్లీ ప్రదక్షిణలకే సమయం సరిపోవడం లేదు. ఢిల్లీ నేతలు కూడా తరచూ తిప్పించుకునే పనిని మానడం లేదు. ఇకపోతే మంత్రులు ఎవరికి వారు యమునాతీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. సిఎం రేవంత్ రెడ్డి పరిస్థితి దినదినగండంగా ఉంది. స్పస్టమైన పనులు చేపట్టలేదు. పాలనలో దూకుడు కనిపించడం లేదు. అందుకే ప్రజల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి మెల్లగా వ్యాపిస్తోంది. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ముద్ర పాలనపై ఇంకా పడలేదు. ఎందుకంటే కాంగ్రెస్ 15 నెలల పాలనలో ఏం జరిగిందో చెప్పడానికి పెద్దగా ఏమీ లేదు. కనీసం రేషన్ కార్డుల సంస్కరణలు జరగేలదు. కిలో బియ్యం ధరలను పెంచలేదు. ఖర్చులను తగ్గించుకోవడం లేదు. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలతో ప్రజలను ఎంతోకాలం నమ్మించలేమని కాంగ్రెస్ నేతలు తెలుసుకుంటే మంచిది. బిసి కులగణన లాంటిది హడావిడిగా అమలు చేయడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం అభాసుపాలవుతోంది. రైతురుణ మాఫీ వల్ల లాభం కన్నా విమర్శలే ఎక్కువగా ఉన్నాయి. దాదాపు రూ. 25వేల కోట్ల మేర రుణమాఫీ చేసినా ఆశించిన రాజకీయ ప్రయోజనం నెరవేరలేదు. రైతు రుణ మాఫీ చేసి కూడా విమర్శలు ఎదుర్కొంటున్నారు. రైతులు కూడా సంతృప్తిగా లేరు. రేషన్ కార్డుల పంపిణీ వ్యవహారంలో, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు స్వీకరణలో కూడా సరైన కసరత్తు సక్రమంగా జరగలేదు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని నిర్మించాలనే విషయంలో కూడా నేతల్లో స్పష్టత లేదు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలంటే సాధ్యమా అన్నది ఆలోచన చేయడం లేదు. పేదలకే రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు అన్న ధృడవైఖరి కొరవడింది..మొత్తం మీద రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆశించిన మేర పనిచేయడం లేదన్న అభిప్రాయం వ్యాపిస్తోంది. ఈ వ్యతిరేక భావనను మొగ్గలోనే తొలగించని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అప్రతిష్ఠపాలవుతుంది. కేంద్రంలోని కాంగ్రెస్ అధిష్టానం కూడా స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించాలి. అదేపనిగా నేతలను ఢిల్లీకి పిలించుకుని కాలక్షేపం చేసే ప్రయత్నాలు మానుకోవాలి. లేకుంటు కాంగ్రెస్ మారదన్న ధృడవైరికి ప్రజలు రాగలరు.


# జర్నలిస్టుల రక్షణ బాధ్యత ప్రభుత్వాలదే

విశాఖపట్నం,దేశ వ్యాప్తంగా జర్నలిస్టుల రక్షణ బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్ఎజె) గంట్ల శ్రీనుబాబు కోరారు. పాత్రికేయుల రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేకంగా చట్టం చేయాలని, రెండు దశాబ్దాలుగా పాత్రికేయ సంఘాలు కోరుతున్నాయన్నారు. విజయనగరం జిల్లా మక్కువ మండలం ప్రజాశక్తి రిపోర్టర్ మల్వాడా రామారావుపై అక్కడ టీడీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు దాడి చేయడంతో పాటు, రామారావును చంపుతానని బెదిరించడంతో సోమవారం ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్, ఏపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా డీఐజీలు, కమిషనర్లు, కలెక్టర్లుకు స్థానిక నాయకత్వాలు వినతిపత్రాలు అందజేశాయి. రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు విశాఖలో కూడా విశాఖ డీఐజీ గోపినాథ్ జెట్టి కార్యాలయంలో జర్నలిస్టులంతా కార్యాలయం మేనేజర్ సూర్యారావు, సీసీ గణేష్‌లను కలిసి వినతిపత్రం అందించారు. అంతకు ముందు ఏయూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలు అందించి, అక్కడి నుంచి జర్నలిస్టులంతా ర్యాలీగా డీఐజీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులను కాపాడాలని, అలాగే దాడులకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు చేపట్టాలని, జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మీడియాతో మాట్లాడుతూ ? నేటి తరం నాయకులు కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంటి ఆపార అనుభవం ఉన్న నాయకులను చూసి ఎంతో నేర్చుకోవాలన్నారు. ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలని, అలా కాకుండా జర్నలిస్టులను చంపుతానని బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మధుసూధనరావు మాట్లాడుతూ ప్రజాశక్తి పాత్రికేయుడు రామారావుపై దాడి చేసి బెదిరించిన వేణుగోపాల్ నాయుడును తక్షణమే అరెస్టు చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరింతగా ఆందోళన చేసేందుకు తాము సిద్దమన్నారు. ఫెడరేషన్ అర్బన్ కార్యదర్శి జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు ఇరోతి ఈశ్వరరావు, కె. మదన్,ఉపాధ్యక్షుడు మళ్ల దేవత్రినాథ్, నాయుడు, ఏపియూడబ్ల్యూజె అర్బన్ కార్యదర్శి ఆర్, రామచంద్రరావు, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్, తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జర్నలిస్టుల అందించిన వినతిపత్రాన్ని అధికారులు పరిశీలించారు. తక్షణమే డీఐజీ గోపినాథ్‌జెట్టి దృష్టికి తీసుకువెళ్లి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# ఏం జరుగుతోంది?

హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్‌లో ఏం జరుగుతోంది..? నేతలు వర్గాల వారిగా విడిపోయారా? తమ ఆధిపత్యం కోసం పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారా? క్రమంగా ప్రభుత్వానికి ప్రజా మద్దతు తగ్గిపోతోందా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నప్పటికీ ప్రజలు ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. నెల రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ అంతర్గత సర్వేలో ఈ విషయంపై స్పష్టత వచ్చిదని కాంగ్రెస్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సమన్వయం లేకపోవటంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్న విషయాన్ని పార్టీ అధిష్ఠానం పెద్దలు గుర్తించారని అంటున్నారు. ఈ క్రమంలోనే పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కీలక మార్పులు చేసేందుకు రాహుల్ గాంధీ టీం రంగంలోకి దిగింది. ఇందులో భాగంగానే మొదటి వేటు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి దీపాదాస్ మున్షీపై పడిందని కాంగ్రెస్ వర్గాలే చెబుతున్నాయి. ఆమె స్థానంలో రాహుల్ గాంధీకి అత్యంత నమ్మకస్తురాలైన మీనాక్షి నటరాజన్ ను తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జిగా రాహుల్ గాంధీ నియమించారు. దీపాదాస్ మున్షీని పక్కకు తప్పించడం పట్ల కాంగ్రెస్‌లోని మెజార్టీ నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీల నేతలు విమర్శలు ఎక్కుపెడుతున్న వేళ.. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న వేళ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మార్పు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది. అయితే పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేయడంలో దీపాదాస్ మున్షీ ఫెయిల్ అయ్యారన్న విమర్శలు కూడా ఉన్నాయి. పార్టీలో సీనియర్లను ఏ మాత్రం పట్టించుకోకుండా తనకంటూ ఓ వర్గాన్ని ఏర్పాటు చేసుకుని దీపాదాస్ మున్షీ ఏకపక్షంగా వ్యవహరించారని మెజార్టీ శాతం నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో కీలకంగా ఉన్నవారితో కూడా దీపాదాస్‌కు ఏ మాత్రం కోఆర్డినేషన్ లేదని కాంగ్రెస్ వర్గాల్లో టాక్ ఉంది. మరోవైపు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నిర్ణయాలతో ప్రమేయం లేకుండా ఆమె సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారని.. పార్టీలోనే కాక ప్రభుత్వంలోనూ ఆమె జోక్యం పెరిగిందన్న వాదన ఉంది. కొంతమంది అధికారులను తన దగ్గరకు పిలిపించుకుని పనులు చేయించుకున్నారన్న టాక్ ఉంది. అయితే గతంలో ఈ విషయంపై మీడియా ప్రశ్నించగా రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ లు అదేంలేదని కొట్టిపారేశారు. కానీ, పార్టీలో ఏకపక్ష నిర్ణయాలకు తోడు ప్రభుత్వంలో జోక్యం పెరగడంతో ఆమెపై రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పెద్దలకు రాష్ట్ర పార్టీ నేతలు పలుసార్లు ఫిర్యాదులు సైతం చేశారని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కాంగ్రెస్ నేతలు పూర్తిగా విఫలమయ్యారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రేవంత్ సర్కార్ అహర్నిశలు కృషి చేస్తుంది. ఇప్పటికే మహిళలకు ఫ్రీ బస్సుతోపాటు రైతు రుణమాఫీ, రైతు భరోసా నిధులు విడుదల, ఇంధిరమ్మ ఇళ్ల పథకం, ఇంధిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు ఇలా అనేక ప్రతిష్టాత్మక కార్యక్రమాలను అమలు చేస్తుంది. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్ నేతలు విఫలమవుతున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా.. రైతు రుణమాఫీని రేవంత్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేసింది. కానీ, చివరికి ప్రభుత్వానికే చెడ్డపేరు వచ్చింది. దీనికి కారణం.. రుణమాఫీ అమలును ప్రజల్లోకి పార్టీ నేతలు బలంగా తీసుకెళ్లకపోవటమే. ఈ విషయంలో పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయ పర్చడంలో దీపాదాస్ మున్షీ విఫలమయ్యారన్న వాదన బలంగా ఉంది. దీనికితోడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆమెకు మధ్య గ్యాప్ ఏర్పడిందన్న చర్చకూడా కాంగ్రెస్ వర్గాల్లో ఉంది. దీంతో రాహుల్ గాంధీ టీం రంగంలోకిదిగి ఆమెను రాష్ట్ర పార్టీ ఇంచార్జి బాధ్యతల నుంచి తప్పించారని సమాచారం. కొత్త ఇన్‌ఛార్జ్‌గా మీనాక్షి నటరాజన్ నియమితులయ్యారు. మున్షీ స్థానంలో ఆమె ఫుల్ టైం కార్యకలాపాలు కొనసాగించనున్నారు. రాహుల్‌గాంధీ టీమ్‌లో కీ పర్సన్‌గా మీనాక్షికి పేరుంది. అయితే, ఆమె ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. ముఖ్యంగా పార్టీ నేతల్లో ఐక్యత కోసం ఆమె ప్రయత్నాలు చేయాల్సి ఉంది. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సమన్వయం పెంచి ప్రభుత్వ పథకాలకు గ్రామ స్థాయి నుంచి విస్తృత ప్రచారం పొందేలా మీనాక్షి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. దీనికితోడు త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల సమయం నాటికి గ్రామ స్థాయిలో ప్రజల్లో ప్రభుత్వంపై నెలకొన్న వ్యతిరేకతను తొలగించి, కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుత పాలన అందిస్తున్నదన్న

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను సాగనంపేందుకే.. గులాబీ బాస్ కొత్త స్కెచ్




హైదరాబాద్,సిర్పూర్ టీ కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్ విచిత్రమైన రాజకీయానికి తెర లేపింది. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ మధ్య గులాబీ పార్టీ స్థానిక సమరం పరీక్ష పెట్టింది .. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరు పార్టీకి ఎక్కువ స్థానాలు దక్కించుకుని వస్తే వారికి పార్టీ ఇన్చార్జ్ పదవి కట్టబెడతారంట. అర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సిర్పూర్ టీ నుండి సాగనంపేందుకే గులాబీ బాస్ ఈ పరీక్ష పెట్టారన్న టాక్ వినిపిస్తుంది. మరి లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో ఆర్ఎస్‌పై కోనప్ప పైచేయి సాధిస్తారా? అసలు కాంగ్రెస్‌లో చేరిన కోనప్ప అంతలోనే ఎందుకు యూటర్న్ తీసుకున్నారు?

### సిర్పూర్ టీ బీఆర్ఎస్ ఇన్చార్జ్ పదవి కోసం పోటాపోటీ

కొమురం భీమ్ జిల్లా సిర్పూర్ టీ నియోజకవర్గం ఇన్చార్జ్ పదవి కోసం గులాబీ పార్టీలో మళ్లీ యుద్ధం మొదలైంది. ఈ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తిరిగి బీఅర్ఎస్ వైపు చూస్తుండటంతో అక్కడ రాజకీయం రసకందాయంలో పడింది .. కాంగ్రెస్‌తో తన రాజకీయ జీవితం ప్రారంభించిన కోనప్ప 2004లో కాంగ్రెస్ పార్టీ తరపున సిర్పూర్ శాసనసభ నియోజకవర్గం నుండి మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచార. 2009 ఎన్నికలతో పాటు 2010లో జరిగిన ఉప ఎన్నికల్లో పరాజయం పాలైన ఆయన తర్వాత తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు.

### 2014లో బీఎస్పీ టికెట్‌తో గెలిచి టీఆర్ఎస్ లో చేరిక

రాష్ట్ర విభజన సమయంలో కోనప్ప కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఎస్పీలో చేరారు. 2014లో జరిగిన తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో బీఎస్పీ టికెట్ పై పోటీ చేసి రెండు సార్లు తనను ఓడించిన కావేటి సమ్మయ్యపై విజయం సాధించారు. గెలిచాక గులాబీ కండువా కప్పుకున్న ఆయన 2018లో జరిగిన తెలంగాణ ముందస్తు ఎన్నికలలో టీఆర్ఎస్ టికెట్ పై పోటీచేసి సిర్పూర్ నుంచి మూడో సారి విజయం సాధించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కోనప్ప తిరిగి బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి హరీష్ బాబు చేతిలో పరాజయం పాలయ్యారు.

### లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో పొత్తు ..

2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కేసీఆర్ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుని అప్పట్లో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ప్రాధాన్యత ఇవ్వడం రుచించని కోనప్ప కారు పార్టీకి గుడ్ బై చెప్పి హస్తం నీడకు చేరారు. అయితే కాంగ్రెస్‌లో తనకు సరైన ప్రాధాన్యత లభించడం లేదన్న అసంతృప్తితో ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తిరిగి కారు ఎక్కడానికి రెడీ అయిన ఆయన ఇటీవల ఫాంహౌస్‌కు కేసీఆర్‌ను కలిసి వచ్చారంట. ఆ సందర్భంగా కేసీఆర్ పార్టీలోకి తిరిగి రావాలని కోనప్పను ఆహ్వానించారని తెలిసింది. అయితే బీఆర్ఎస్ బాస్ కోనప్పకి ఒక షరతు పెట్టారని ప్రచారం జరుగుతోంది.

### స్థానికి సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుకోవాలని షరతు

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సిర్పూర్ టీ నియోజకవర్గంలో సత్తాచాటాలని పెట్టిన షరతుని కోనప్ప కూడా సవాలుగా తీసుకున్నారంట. అయితే కోనప్ప రాకను మాజీ ఐపీఎస్ అధికారి అర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యతిరేకిస్తున్నారని చెప్తున్నారు. ప్రస్తుతం సిర్పూర్ నియోజకవర్గం లో అర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్ ఇన్చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ప్రవీణ్‌కుమార్ సిర్పూర్ నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారంట. అందుకే కోనప్ప రాకను అర్ఎస్పీ తీవ్రంగా వ్యతరేకిస్తున్నారంట.

### కేటీఆర్‌ను కలిసి అభ్యర్థించిన ప్రవీణ్ కుమార్

ఆ మాజీ ఐపీఎస్ అధికారి తన అనుచరగణంతో హైదారాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు కేటిఅర్‌తో భేటీ అయ్యారంట. కోనప్పను పార్టీలోకి తీసుకోవద్దని కేటీఅర్ ను అభ్యర్థించినట్లు చెప్తున్నారు .. అయితే కేటీఆర్ కూడా ఆయనకు అదే టాస్క్ పెట్టారంట. స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటండి. మెజారిటీ సీట్లు సాధించుకు రమ్మని ఆర్ఎస్పీకి టార్గెట్ ఇచ్చారంట.లోకల్‌బాడీ ఎలక్షన్స్‌లో సత్తా చాటుకుంటే ఎవరినీ పార్టీలోకి తీసుకోబోమని కేటీఆర్ ఆయనకు హామీ ఇచ్చినట్లు ఆర్ఎస్పీ వర్గీయులు చెప్పుకుంటున్నారు.

### ప్రవీణ్, కోనప్పలకి విషమ పరీక్షగా మారిన స్థానిక ఎన్నికలు

కోనప్ప చేరికను ప్రవీణ్‌కుమార్ వ్యతిరేకిస్తుండటంతో కేసీఆర్ కూడా కోనప్పను స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటుకుంటే పార్టీలోకి తీసుకుంటామని చెప్పారంట ఆ క్రమంలో అటు ప్రవీణ్‌కుమార్‌కి, ఇటు కోనేరు కోనప్పకి స్థానిక సంస్థల ఎన్నికలు విషమ పరీక్షగా మారాయంటున్నారు. ఆ పరీక్షలో సత్తాచాటడానికి కోనప్ప సిద్దమవుతున్నారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరా.. కాని అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని. స్థానిక సంస్థల ఎన్నికలలో తన వాళ్లు స్వతంత్రంగా పోటీ చేస్తారని చెప్తున్నారు. అందులో భాగంగానే ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఎన్నికల తర్వాత పార్టీ మార్పుపై ప్రజలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామంటున్నారు.

### ఆర్ఎస్పీకి పొమ్మన లేక పొగపెడుతున్నారా?

కేటీఅర్ పెట్టిన టార్గెట్‌తో అర్ఎస్పీ సైతం స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. మెజారిటీ సీట్లు సాధించి సత్తాచాడటానికి కసరత్తు మొదలు పెట్టారు. కోనప్ప వర్గం అర్ఎస్పీ కన్నా ఎక్కువ సీట్లు సాధిస్తే కోనప్పకు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ ఖాయమైనట్లే అంటున్నారు.. ఒకవేళ కోనప్ప కంటే అర్ఎస్పీ మంచి మెజారిటీ సీట్లు సాధిస్తే ఆయనే ఎమ్మెల్యేగా బరిలో ఉండే అవకాశం కనిపిస్తుంది. అయితే ఈ సందర్భంగా పార్టీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. సిర్పూర్ నుంచి ఆర్ఎస్పీ తనంతట తాను వెళ్లేలా చేయడానికే గులాబీబాస్ ఈ పరీక్ష పెట్టారంట. మరి స్థానిక సంస్థల ఎన్నికల్లో కోనప్ప, ఆర్ఎస్పీ ఇద్దరు బోల్తా పడితే అప్పుడు కారు పార్టీ పరస్థితి ఏంటో చూడాలి.

# తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ.. అలాగైతే మా పరిస్థితేంటి?



హైదరాబాద్, తెలంగాణలో రాజకీయాలు బీసీల చుట్టూనే తిరుగుతున్నా యా? అధికార కాంగ్రెస్ పార్టీ వేసిన అస్త్రానికి విపక్షాల్లో వణుకు మొదలైందా? అదే జరిగితే తమ పరిస్థితి ఏంటని నేతలు ఎందుకంటున్నారు? వచ్చే ఎన్నికలు బీసీల చుట్టూనే రాజకీయాలు తిరుగుతాయా? అదే జరిగితే బీఆర్ఎస్ పరిస్థితి ఏంటనేది అసలు చర్చ. దీనిపై హైకమాండ్ నుంచి నేతలకు ఎలాంటి సంకేతాలు వచ్చాయి?

### తెలంగాణ రాజకీయాలు కొత్త మలుపు

రాజకీయాల్లో ఎత్తుకు పైఎత్తులు వేయాలి. సమయం, సందర్భంగా వ్యవహరించిన వారు మాత్రమే నిలదొక్కుకుంటారు. లేకుంటే వెనుకబడిపోవడం ఖాయం. తెలంగాణలో రాజకీయాలు ఇప్పుడు బీసీల చుట్టూనే తిరుగుతోంది. కాంగ్రెస్ ప్లాన్ ప్రకారం బీసీలకు రాజ్యాధికారం కావాలనే పట్టుబడుతున్నారు ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ. ఈ క్రమంలో తెలంగాణలో ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏడాదిలోపు కులగణన చేపట్టారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 56 శాతం ఉందని నివేదిక తేల్చింది.తెలంగాణకు భవిష్యత్తులో బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అవుతాడని బయటపెట్టారు టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్. రాష్ట్రానికి బీసీ వ్యక్తిని సీఎం చేయడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఐదేళ్లు కొనసాగుతారని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికలు బీసీల చుట్టూనే తిరుగుతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామని ఓబీసీ సెల్ కార్యవర్గ సభ్యులకు పిలుపునిచ్చారు ఆయన.

### పదేళ్ల కిందట టీడీపీ

ఈ వ్యవహారంపై మిగతా రాజకీయ పార్టీల్లో చర్చ మొదలైంది. 2014 ఎన్నికల్లో బీసీ వ్యక్తి సీఎం అనే నినాదాన్ని ఎత్తుకుంది టీడీపీ. ఆ సమయంలో టీడీపీకి బాగానే సీట్లు వచ్చాయి. ఇక 2023 నాటికి వద్దాం. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో నల్గొండలో జరిగిన బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తి సీఎం అవుతారని చెప్పుకొచ్చారు ఆయన.కాంగ్రెస్‌ను దెబ్బకొట్టడానికి అప్పట్లో ఈ ఫార్ములాను అమిత్ షా ఉపయోగించారనే ప్రచారం సాగింది. ప్రస్తుతానికి వచ్చేద్దాం.. రాహుల్‌గాంధీ మొదటి నుంచి బీసీ నినాదం ఎత్తుకున్నారు. ఈ విషయంలో బీజేపీ తర్జన భర్జన పడుతోంది. ఏం చెయ్యాలో తికమక పడుతోంది. కనీసం కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నట్లుగా కులగణన చేయడానికి ముందుకు రావడంలేదు.

### కన్ఫ్యూజన్‌లో బీఆర్ఎస్

ఇక బీఆర్ఎస్ విషయానికొద్దాం. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ చేసిన కామెంట్స్ బీఆర్ఎస్‌లో అప్పుడే అలజడి మొదలైనట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాబోయే రోజుల్లో కాబోయే ముఖ్యమంత్రి బీసీయేనని చెప్పడంతో ఒక్కసారిగా నేతలు షాకయ్యారు. దీనిపై ఏ ఒక్కరూ నోరు ఎత్తకూడదని సంకేతాలు వెళ్లినట్టు ప్రచారం మొదలైపోయింది. 2014 ఎన్నికల్లో తెలంగాణ వస్తే దళితుడ్ని సీఎం చేస్తామని కేసీఆర్ పదేపదే చెప్పుకొచ్చారు. గడిచిన పదేళ్లు బీఆర్ఎస్ పాలనలో బీసీ, మహిళలకు సరైన ప్రాధాన్యత దక్కలేదని చాలామంది నేతల మాట. ప్రస్తుతం టీపీసీసీ చీఫ్ విసిరిన బీసీ బాణం.. అప్పుడే ఆ పార్టీలో చర్చకు దారితీసిందని సమాచారం. మరి జాతీయ పార్టీల మాదిరిగా బీఆర్ఎస్ పార్టీ కూడా బీసీ నినాదం ఎత్తుకుంటుందా? అన్నదే అసలు పాయింట్. మొత్తానికి కాంగ్రెస్ ట్రాప్‌లో కారు పడినట్టేనని అంటున్నారు.

# యనమలకు చివరి బడ్జెట్ సెషన్ ?



అమరావతి,యువ లాయర్ గా ఉంటూ అన్న గారి పిలుపు మేరకు రాజకీయాల్లోకి వచ్చిన వారు యనమల రామక్రిష్ణుడు. అప్పట్లో ఆయన తూర్పుగోదావరి జిల్లా తుని ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు క్రియేట్ చేశారు. అలా ఎన్టీఆర్ తొలి మంత్రివర్గంలో న్యాయ, పురపాలక శాఖ బాధ్యతలు నిర్వహించారు. అంతే కాదు 1985-89 మధ్య మంత్రిగా, 1989-94లో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా, 1995-99లో శాసనసభ స్పీకర్‌గా కొనసాగారు.ఇక 1999నుంచి 2004 మధ్యలో ఆయన ఆర్థిక మంత్రిగా ఉన్నారు. అలాగే 2014 నుంచి 2019 మధ్యలో మరోసారి ఆర్థిక మంత్రిగా చేశారు. 2004-08 మధ్య కాలంలో తిరిగి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ బాధ్యతలు నిర్వహించారు. ఆయన ఆర్థిక మంత్రిగానే కాకుండా శాసనసభ వ్యవహారాల శాఖను వాణిజ్య పన్నుల శాఖను నిర్వహించారు.ఇక చూస్తే యనమల 1983 నుంచి 2009 మధ్యలో ఏకంగా 26 ఏళ్ళ పాటు ఎమ్మెల్యేగా గెలిచారు. 2013 నుంచి ఎమ్మెల్సీగా కంటిన్యూగా కొనసాగుతున్నారు. ఈ ఏడాది మార్చి 30తో ఆయన పదవీకాలం పూర్తి అవుతుంది. అంటే యనమల రాజకీయ జీవితంలో కేవలం 2009 నుంచి 2013 మధ్యలో నాలుగేళ్ళ కాలం తప్ప మొత్తం 42 ఏళ్ల రాజకీయం లో 38 ఏళ్ళ పాటు చట్ట సభలలోనే సాగింది. ఆయన ప్రతిపక్షంలో ఉన్నా పదవులు వరించాయి. శాసన మండలిలో ప్రతిపక్ష నేతగా కూడా కేబినెట్ హోదాను ఆయన అందుకున్నారు.ఈ నేపథ్యంలో మరో నెల రోజులలో ఎమ్మెల్సీగా పదవీ విరమణ చేయనున్న యనమలకు మళ్ళీ ఆ ఎమ్మెల్సీ పదవి మూడవసారి దక్కుతుందా అన్నది ఒక చర్చ. అయితే యనమలకు రాజ్యసభకు వెళ్ళాలని కోరిక ఉంది. 2026లో ఏపీలో నాలుగు ఎంపీ సీట్లు ఖాళీ అవుతాయి. అందులో ఒకటి ఇవ్వాలనుకున్నా ఆయన మరో పదిహేను నెలల పాటు వేచి చూడాల్సి ఉంది.అయితే తెలుగుదేశం పార్టీ ఇటీవల కాలంలో తీసుకుంటున్న నిర్ణయాలను చూస్తే కనుక సీనియర్లకు నో చాన్స్ అన్నట్లుగానే ఉంది. దానికి తోడు ఈ మధ్యన కాకినాడ పోర్ట్ విషయంలో యనమల సీఎం కి రాసిన ఒక బహిరంగ లేఖలో కుల ప్రస్తావన చేయడం అధికార తెలుగుదేశం పార్టీని ఇబ్బంది పెట్టిందని అంటున్నారు.ఈ నేపథ్యంలోనే ఆయన తుని మునిసిపాలిటీ ఎన్నికల్లో టీడీపీకి మెజారిటీ తెచ్చి అధికార పీఠం దక్కేలా పావులు కదుపుతూ కొత్త రాజకీయానికి తెర తీశారు. ఒక వేళ ఇందులో విజయవంతం అయి మున్సిపాలిటీ దక్కినా 2026 మార్చితో ఆ పదవీకాలం పూర్తి అవుతుంది. ఈ విధంగా తన క్రెడిట్ ని చెప్పుకుని పార్టీ హైకమాండ్ చల్లని చూపుతో ఆయన మళ్ళీ చట్ట సభలలో అడుగు పెట్టడానికి చూస్తున్నారా అన్న చర్చ సాగుతోంది.అయితే యనమల రామక్రిష్ణుడు విషయంలో అయితే ఆయన మాగ్జిమం పదవులు అన్నీ తీసుకున్నారు అన్న మాట అయితే ఉంది. ఆయనకు పార్టీ ఏ విధమైన అన్యాయం చేయలేదని కూడా అంటున్నారు. ఆయన ఇపుడు ఏడున్నర పదుల వయసులో ఉన్నారు. ఆయన వారసురాలికి తుని టికెట్ ఇచ్చారు. ఎమ్మెల్యే అయింది. అల్లుడు, వియ్యంకుడు పదవుల్లో ఉన్నారు. సో యనమలకు ఎమ్మెల్సీ పదవి పూర్తి అయితే రాజకీయంగా విశ్రాంతి జీవితం గడపడమే అని కూడా అంటున్నారు. అలా ఆలోచిస్తే ఈ నెల 24 నుంచి మొదలయ్యే బడ్జెట్ సెషన్ ఈ మాజీ ఆర్థిక మంత్రికి చివరిది కావచ్చు అన్నది చర్చగా ఉంది.

# సంక్షోభంలో అకాలీదళ్.. సిక్కు బాడీ చీఫ్ హర్జిందర్ ధామీ రాజీనామా



న్యూఢిల్లీ, భారతదేశంలోని గురుద్వారాల నిర్వహణకు బాధ్యత వహించే సంస్థ శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు హర్జిందర్ సింగ్ ధామి సోమవారం నాడు తన పదవికి రాజీనామా చేశారు.సిక్కుల అత్యున్నత తాత్కాలిక అధికారం అయిన అకల్ తఖ్త్‌కు తాను కట్టుబడి ఉన్నానని ధామి చెప్పారు. అయితే, దమ్‌దామా సాహిబ్ జాతేదార్ గా జియాని హర్‌ప్రీత్ సింగ్‌ను SGPC ఇటీవల తొలగించడంపై ఫిబ్రవరి 13న జతేదార్ రఘ్‌బీర్ సింగ్ ఫేస్‌బుక్ లో ఓ పోస్ట్ తీవ్రంగా విమర్శలు గుప్పించారు. జియాని హర్‌ప్రీత్ సింగ్‌ను తొలగించడం చాలా ఖండించదగినది, దురదృష్టకరం అని అన్నారు.ఇక, దుష్ప్రవర్తన ఆరోపణల నేపథ్యంలో ఫిబ్రవరి 10న SGPC ఎగ్జిక్యూటివ్ ప్యానెల్ నుంచి హర్‌ప్రీత్ సింగ్‌ను తొలగించింది. అతడు మాజీ బామ్మర్ది గురుప్రీత్ సింగ్ చేసిన ఆరోపణలను ముగ్గురు సభ్యుల ప్యానెల్ దర్యాప్తు చేసింది. ముగ్గురు ఎగ్జిక్యూటివ్ ప్యానెల్ సభ్యులు విచారణ చేస్తున్నప్పటికీ.. హర్‌ప్రీత్ సింగ్‌ను తొలగించడం వివాదానికి దారితీసింది. దీనిపై స్పందించిన సింగ్ మాట్లాడుతూ.. నాపై వచ్చిన ఆరోపణలు వ్యక్తిత్వ విధ్వంసానికి ప్రయత్నించడం తప్ప మరొకటి కాదు అన్నారు. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ 2008 లోనే ఈ ఆరోపణలపై దర్యాప్తు చేసింది. ఒక కమిటీ ఏర్పడింది.. నాతో పాటు నా బంధువులు, స్నేహితులు, సహోద్యోగులను ప్రశ్నించారు. ఫలితంగా నేను అన్ని ఆరోపణల నుంచి విముక్తి పొందాను అని హర్‌ప్రీత్ సింగ్ చెప్పారు.

# వేడి తగ్గిన దాడి...లేదుగా సందడి !



అమరావతి,ఆయన మాటలలో వేడి వాడి ఉంటుంది. మంచి భాషతో పాటు చమత్కారాలు వాడతారు ప్రత్యర్థులను తనదైన వాక్చాతుర్యంతో సెటైర్లతో ఆయన అల్లలాడించగలరు. ఆయన పూర్వాశ్రమంలో మాస్టారు కావడం వల్ల రాజకీయాల్లోనూ ఆయన ఒక విధంగా ఆ గురు పరంపరను కొనసాగించారని చెప్పాలి. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన మాజీ మంత్రి టీడీపీ సీనియర్ నేత దాడి వీరభద్రరావు గురించి ఇపుడు ఒక రకమైన చర్చ సాగుతోంది. మాస్టారు మౌన ముద్ర దాల్చారు అన్నదే ఆ చర్చ.ఎంతో రాజకీయ అనుభవం కలిగి ప్రతిభా పాటవాలు కూడా ఉన్న నాయకుడు దాడి. ఆయన 1985లో టీడీపీలో చేరారు. ఆ వెంటనే ఎమ్మెల్యే అయిపోయారు. 2004 దాకా అంటే ఇరవయ్యేళ్ళ పాటు ఎమ్మెల్యేగా మంత్రిగా కీలక పదవులు నిర్వహించారు. 2006 నుంచి 2012దాకా శాసనమండలిలో ఎమ్మెల్సీగా కేబినెట్ ర్యాంక్ కలిగిన ప్రతిపక్ష నేతగా కూడా దాడి పనిచేశారు.అయితే రెండోసారి తనను ఎమ్మెల్సీగా చేయలేదన్న బాధతో ఆయన ఒకే ఒక్క తప్పటడుగు వేశారు. నాడు జైలులో ఉన్న జగన్ ని కలసి వైసీపీలో చేరిపోయారు. 2014లో కుమారుడికి టికెట్ తెచ్చుకున్నారు కానీ ఓటమి పాలు అయ్యారు. ఇక అక్కడే ఉన్నా బాగుండేది. కానీ నిలకడ లేని రాజకీయం తో వైసీపీని వీడి బయటకు వచ్చారు మళ్ళీ టీడీపీలో చేరేందుకు చూశారు.తీరా 2019 ఎన్నికల వేళ వైసీపీ వేవ్ చూసి అందులో మరోసారి చేరారు. కానీ ఈసారి జగన్ టికెట్ ఇవ్వలేదు. అంతే కాదు పార్టీ అధికారంలోకి వచ్చినా అయిదేళ్ళ పాటు ఏ నామినేటెడ్ పదవినీ ఇవ్వలేదు. దాంతో తీవ్ర ఆగ్రహం అసంతృప్తితో ఆయన 2024 ఎన్నికల ముందు సొంత గూటికి చేరుకుని టీడీపీ మెంబర్ అయ్యారు.ఆనాడు ఆయన తన కుమారుడికి అనకాపల్లి ఎమ్మెల్యే టికెట్ ఆశించారు అని అంటారు. అది దక్కలేదు అయితే గడచిన ఎనిమిది నెలలలో అనేక నామినేటెడ్ పదవుల పందేరం సాగినా ఆయనకు కానీ కుమారుడికి కానీ అవకాశం దక్కలేదు. దాంతో ఆయనలో మళ్ళీ అసంతృప్తి రాజుకుంటోందని అంటున్నారు. 2012 నుంచి అటూ ఇటూ పార్టీలు మారుస్తూ రాజకీయంగా నిలకడ లేకుండా పోవడం వల్లనే ఆయనకు ఈ విధంగా జరుగుతోంది అని అంటున్నారు. దాడి 2012లో టీడీపీని వదిలేశారు అలా అనకాపల్లి రాజకీయాల్లోకి కొత్త వారు వచ్చేశారు. ఇపుడు అంతా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ హవా సాగుతోంది. అనకాపల్లి ఎమ్మెల్యే టికెట్ పొత్తులో జనసేనకు వెళ్ళింది. దాంతో కీలకమైన నామినేటెడ్ పదవి పీలాకు దక్కింది. అంతే కాదు 2029లో పార్టీ టికెట్ హామీ కూడా ఆయనకే దక్కింది అని టాక్.అదే సామాజిక వర్గానికి చెందిన దాడి కుటుంబానికి నామినేటెడ్ పదవి కూడా దక్కకపోవడానికి కులమే ఒక మైనస్ అని అంటున్నారు దానికి తోడు పార్టీలు మారుస్తూ స్థానికంగా దాడి కుటుంబం తమ సొంత అనుచర బలాన్ని కోల్పోయింది అని కూడా అంటున్నారు ఇక దాడి ఫ్యామిలీకి పదవులు ఇవ్వకుండా లోకల్ టీడీపీ వర్గాలే అడ్డుకుంటున్నాయని అంటున్నారు.ఈ విధంగా రాజకీయంగా ఎటూ కలసిరాకపోవడంతో దాడి వీరభద్రరావు మాస్టారు మౌనమే నా భాష అని సైలెంట్ అయ్యారని అంటున్నారు. విశాఖ జిల్లాలో టీడీపీ బలంగా ఉంది. ఎంతో మంది నేతలు ఉన్నారు. సీనియర్లను పక్కన పెట్టి కొత్త వారిని తీసుకోవాలని పార్టీ చూస్తోంది. ఈ క్రమంలో పాత నీరు అలా పక్కకు పోతోంది అని అంటున్నారు. దాంతోనే చాలా మంది పార్టీ సీనియర్లు అన్న ముద్రతో కాలం వెళ్ళబుచ్చాల్సి వస్తోంది అని అంటున్నారు.

# నాయకుడిగా కేటీఆర్ వైఫల్యం ఫిక్సైపోయినట్లేనా?..



హైదరాబాద్,బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు రాజకీయ అజ్ఞాతం నుంచి బయటకు వచ్చేస్తున్నారు. బుధవారం (ఫిబ్రవరి 19) ఆయన బీఆర్ఎస్ కార్యనిర్వాహక సమావేశంలో ప్రసంగించనున్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ రజతోత్సవ వేడుకల నిర్వహణపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ అధ్యక్షడి హోదాలో కేసీఆర్ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. 2023 ఎన్నికలలో పరాజయం పాలై అధికారాన్ని కోల్పోయిన తరువాత కేసీఆర్ దాదాపు రాజకీయ అజ్ఞాత వాసం చేశారు.పూర్తిగా ఫాం హౌస్ కే పరిమితమయ్యారు. మధ్యలో 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో పార్టీ తరఫున ప్రచారం చేసినా అదేమంత చెప్పుకోదగ్గ విషయం కాదు. మొత్తం మీద ఒక దశలో ఆయన రాజకీయ సన్యాసం పుచ్చుకున్నారా అన్న అనుమానాలు కూడా వ్యక్తం అయ్యాయి. అడపాదడపా తనను కలవడానికి వచ్చిన పార్టీ నేతలతో ఫామ్ హౌస్ లో రాజకీయాలపై, పార్టీ విషయాలపై మాట్లాడినా అదంతా ఆఫ్ ది రికార్డ్ అన్నట్లుగానే ఉండేది. అయితే ఇప్పుడు కేసీఆర్ తన రాజకీయ అజ్ఞాత వాసం నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్నారు.అది పార్టీ నేతల్లో, క్యాడర్ లో నూతనోత్సాహాన్నినింపవచ్చు కానీ అదే సమయంలో మరో విషయాన్ని కూడా తేటతెల్లం చేస్తోంది. అదేమిటంటే పార్టీని ముందుండి నడిపించడంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు వైఫల్యం. ఔను కేసీఆర్ రాజకీయ వారసుడిగా కేటీఆర్ తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టడానికి కేసీఆర్ ఎప్పుడో అవసరమైన రూట్ క్లియర్ చేశారు. బీఆర్ఎస్ రెండో సారి విజయం సాధించగానే కేటీఆర్ ను పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిని చేసి.. తన తరువాత సీఎం కేటీఆరేనన్న సంకేతాలు ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే కేటీఆర్ ప్రభుత్వంలో డిఫాక్టో సీఎంగానే వ్యవహరించారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలను కూడా ఆయనే ప్రకటించే వారు. ఒక దశలో కేసీఆర్ జాతీయ రాజకీయాలలోకి దూకేస్తున్నారనీ, అంతకు ముందే కేటీఆర్ ను ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోపెట్టేస్తారని పార్టీ వర్గాలలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అయితే తెరవెనుక ఏం జరిగిందో తెలియదు కానీ కేటీఆర్ పట్టాభిషేకం వాయిదా పడుతూ వచ్చింది. వాస్తవానికి 2018లో ముఖ్యమంత్రి కేసీఆర్ ముందస్తు అసెంబ్లీ ఎన్నికలకు వెళ్ళాలని నిర్ణయించినప్పటి నుంచి, కేటీఆర్ పట్టాభిషేకం వార్తల్లో నలుగుతూనే ఉంది. అందుకోసమే ముందస్తుకు వెళ్ళారని అప్పట్లోనే గట్టిగా వినిపించింది. ఇక 2019 లోక్ సభ ఎన్నికల ముందు అయితే కేసీఆర్ జాతీయ రాజకీయాలలోకి వెళ్ళడం ఖాయమని అన్నారు. ప్రాంతీయ పార్టీల ఫ్రంట్' ఏర్పడిపోయినట్లే ప్రచారం జరిగిపోయింది. అదే సమయంలో కేటీఆర్' సైతం పట్టాభిషేకానికి రెడీ అయిపోయారు. అయితే, అప్పట్లో కారు సారు పదహారు నినాదం బూమరాంగ్ అయ్యింది. దీంతో కేసీఆర్ ఢిల్లీ కలే కాదు.. కేటీఆర్ సీఎం కల కూడా ... కరిగిపోయింది. సరే 2023 ఎన్నికలలో బీఆర్ఎస్ ఓడిపోయింది. అధికారం కోల్పోయి ప్రతిపక్షానికి పరిమితమైంది. కేసీఆర్ రాజకీయ అజ్ఞాత వాసంలోకి వెళ్లిపోయారు. ఈ పరిస్థితుల్లో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కేటీఆర్ పార్టీని ముందుండి నడిపించడంలో విఫలమయ్యారని పార్టీ వర్గాల నుంచే విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యమంత్రి రేవంత్ దూకుడును కేటీఆర్ నిలువరించడంలో విఫలమయ్యారని పరిశీలకులు సైతం విశ్లేషణలు చేశారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ రాజకీయ అజ్ఞాతం వీడి బయటకు రావడానికి రెడీ అయ్యారు. అంతకంటే ముందు.. కేటీఆర్ స్వయంగా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందనీ, కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రిగా పదవీ పగ్గాలు చేపడతారని చెప్పారు. ఇలా చెప్పడం ద్వారా కేటీఆర్ తన వైఫల్యాన్ని స్వయంగా అంగీకరిం చడమే కాకుండా సీఎం రేసులో లేననీ, తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్ మాత్రమే ఉన్నారని స్పష్టంగా చెప్పేశారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com